ప్రజాశక్తి
శుక్రవారం 8 నవంబర్ 2024

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యలపై అవగాహన పెంపొందించుకుని వాటిని సత్వరమే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ విజయ సారథిలతో కలిసి ఆర్డీవోలు తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామసభల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ, రెవెన్యూ గ్రామానికి సంబంధించి గ్రామసభ షెడ్యూల్‌ను సిద్ధం చేయాలన్నారు. గ్రామ సచివాలయం పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు గ్రామ సభ నిర్వహించాలన్నారు. గ్రామస్థాయిలో స్వీకరించే సమస్యలను సంబంధిత తహశీల్దార్ వీఆర్వోలు అవగాహన చేసుకుని వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. సంబంధిత ఆర్డీవోలు క్షేత్రస్థాయిలో తహశీల్దార్ల పనితీరుపై పర్యవేక్షణ ఉంచాలన్నారు. ఎక్కువగా భూ సమస్యలు పదేపదే వస్తున్న కారణంగా వాటి పరిష్కారానికి రెవెన్యూ సిబ్బంది కషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ఆయా గ్రామాల వీఆర్వోలదే ప్రధాన బాధ్యత అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా వినతులను స్వీకరించిన వెంటనే సంబంధిత శాఖలకు పిజిఆర్ఎస్ పోర్టల్ ద్వారా పంపాలని కలెక్టర్ ఆదేశించారు. వారంలో నాలుగు రోజులు ఆయా గ్రామాల్లో తహశీల్దార్ నేతత్వంలో గ్రామసభలు నిర్వహించాలన్నారు. సోమవారం, సాధారణ సెలవులు మినహా గ్రామ సభలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రజలు గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. గ్రామ మండల స్థాయిలో సమస్యలు పరిష్కరించలేనివి మాత్రమే జిల్లా కేంద్రానికి ఫిర్యాదులు రావాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ నిబంధన మేరకు భూ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఆయా డివిజన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. వివిధ దినపత్రికలలో వచ్చిన ప్రతికూల వార్తలపై సంబంధిత శాఖ అధికారులు సమగ్ర సమాచారంతో ఎప్పటికప్పుడు రిజాండర్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి జాప్యం జరిగినా షోకాజు నోటీసులు జారీ చేస్తామన్నారు. జలవనరుల శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని జిల్లాలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి పోలీస్ స్టేషన్ల వివరాలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

పల్లెకు బెల్ట్ కిక్కు..!

- గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- ఓ వైపు లేదంటూనే అమ్మకాలు
- నిర్వాహకులకు అధికార పార్టీ అండ

గత ప్రభుత్వ హయాంలో మద్యం అమ్మకాలను ప్రభుత్వమే నిర్వహించేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పద్ధతికి స్వస్తి చెప్పి ప్రయివేటు వ్యక్తులకు టెండర్ల ద్వారా షాపులను అప్పగించింది. టెండర్ల ద్వారా షాపులను దక్కించుకున్న వ్యాపారులు వారు పెట్టిన మొత్తాన్ని వీలైనంత త్వరగా రాబట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. అందులో భాగంగానే గ్రామాల్లో బెల్టుషాపులకు తెరతీశారు. షాపులు దక్కించుకున్న తర్వాత అనుకున్న స్థాయిలో వ్యాపారాలు లేవన్న సాకుతో బెల్టుదారి పట్టారు. షాపులు దక్కించుకున్న వారు ఎక్కువ మంది కూటమి నాయకులే కావడంతో అధికారాన్ని అడ్డుపెట్టుకుని బెల్టుతో గ్రామాల్లో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

టెండర్ల ద్వారా మద్యం షాపులను దక్కించుకున్న వారు ఇప్పటికే మద్యం షాపులను ప్రారంభించారు. ప్రారంభంలో కొన్ని షాపులకు కొంత అధికార పార్టీ నేతల నుంచి అడ్డంకులు వచ్చినా, ప్రస్తుతం అన్ని సద్దుమణిగాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు అన్ని మద్యం షాపులూ ఇప్పటికే ప్రారంభం అయ్యి అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న మద్యం పాలసీ ప్రకారం ముందుగా చెప్పిన దాని కంటే కమీషన్ గణనీయంగా తగ్గించారనే అభిప్రాయాలు విన్పిస్తున్నాయి. రోజువారీగా జరిగిన వ్యాపారంలో 20 శాతం కమీషన్ భావించగా ఇది అమలు జరగనట్లు తెలుస్తోంది. దీనికి తోడు వ్యాపారాలు కూడా గతంలాగా జరగలేదనే భావన వ్యాపారుల నుంచి విన్పిస్తోంది. షాపు దక్కించుకున్న ప్రతి ఒక్కరూ ఏడాదికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.60 లక్షలు వరకు చెల్లించాలి. వీటికి అదనంగా ఇతర ఖర్చులూ ఉంటాయి. షాపులు దక్కించుకున్న వారు రూ.60 లక్షలు తీరిన తర్వాతనే లాభాల్లోకి వస్తారు. అంటే ప్రతి రోజు సరాసరి రెండు లక్షల రూపాయలకు తగ్గకుండా వ్యాపారం జరిగితేనే వారు లాభాల్లోకి వచ్చే అవకాశం ఉంది.

బెల్టుషాపుల ఏర్పాటు

పెద్ద మొత్తంలో డబ్బులు ఆర్జించాలని భావిస్తున్న మద్యం వ్యాపారులు బెల్టుషాపులకు తెరతీశారు. వారి పరిధిలో బెల్టుషాపులను ప్రోత్సహించి గ్రామాల్లో మద్యం అమ్మకాలకు తెరలేపారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో అనధికారంగా బెల్టుషాపులు ఏర్పాటై అమ్మకాలు కూడా జరుగుతున్నాయి. బెల్టుషాపులు నిర్వహిస్తే మద్యం అమ్మకాలు పెరిగి రోజుకు వారు అనుకున్న మేరకు రూ.2 లక్షల వ్యాపారం జరుగుతుందనే భావన వ్యాపారుల్లో ఉంది. ఇప్పటికే కొందరు బెల్టు ప్రారంభించి అమ్మకాలు చేస్తుండగా మరికొందరు ఎక్సైజ్, పోలీసులు, అధికార పార్టీ నాయకులతో మాట్లాడి పల్లెల్లో ఈ షాపులను ఏర్పాటు చేస్తున్నారు.

అధికార పార్టీ కన్నుసన్నల్లోనే..

గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహణకు సంబంధించిన వ్యవహారం అంతా ఆయా నియోజకవర్గాల్లోని అధికార పార్టీ నేతల కన్నుసన్నల్లోనే నడుస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్య నేతలు ఎవరి పేరుత చెబితే వారే ఆ గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించేలా తీర్మానాలు సైతం చేశారు. ఓ వైపు నేతలు, మరోవైపు అధికారులను ప్రసన్నం చేసుకుని ఇప్పటికే పల్లె బెల్టుషాపుల నిర్వహణను ప్రారంభించేశారు. పెద్దపెద్ద పంచాయతీల్లో బెల్టుషాపుల కోసం పోటీ ఉంటే షాపుల నిర్వాహకులు ముందస్తు డిపాజిట్‌ను వేలం పాటలను నిర్వహించి షాపులను అప్పగిస్తున్నారు.

పల్లె జీవనంపై ప్రభావం

గ్రామాల్లో బెల్టుషాపులు ఏర్పాటు చేయడం ద్వారా పల్లె జీవనంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. రోజంతా కష్టపడి పని చేసిన సొమ్మంతంతా మద్యానికే ఖర్చు చేస్తారని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో బెల్టుషాపులకు వ్యతిరేకంగా మహిళలు తమ నిరసనను వ్యక్తం చేశారు. రెక్కల కష్టాన్ని తాగేసే బెల్టుషాపులపై వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, ఎక్సైజ్, పోలీసులు స్పందించి గ్రామాల్లో బెల్టుషాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు.

అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

విలేకరులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో అర్హులందరికీ దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించనున్నట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీపీఎల్ తెల్ల రేషన్ కార్డు కలిగి ఆధార్ అనుసంధానం చేసుకున్న వినియోగదారులకు ప్రతి ఆర్థిక సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తోందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో మొత్తం 5,72,517 గ్యాస్ కనెక్షన్లకి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. జిల్లాలో దీపం-2 పథకాన్ని సక్రమంగా అమలు చేసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామని తెలిపారు. గ్యాస్ బుక్ చేసుకున్న వాళ్లకి 24 గంటల నుంచి 48 గంటల్లో గ్యాస్ సిలిండర్ డెలివరీ అవుతుందన్నారు. సిలిండర్ చేరిన 48 గంటల్లో సబ్సిడీ మొత్తం వారి ఖాతాల్లోకి జమ అవుతుందన్నారు. ఒక కుటుంబానికి ఒక వినియోగదారుకు మాత్రమే ఈ పథకం లబ్ధి చేకూరుతుందన్నారు. తెలుపు, ఏఏవై అన్నపూర్ణ కార్డులున్న వారు అర్హులన్నారు. లబ్ధిదారులు వారి ఆధార్ నెంబర్‌ను గ్యాస్ కనెక్షన్‌కు అనుసంధానం చేసుకోవాలని చెప్పారు. ఉచిత సిలిండర్ పొందేందుకు ఈకేవైసీ తప్పని సరిఅన్నారు. తెలుపు రేషన్ కార్డులు కలిగిన వారికి గ్యాస్ కనెక్షన్ క్రియాశీలకంగా ఉన్న ప్రతి ఒక లబ్ధిదారునికి దీపం పథకం వర్తిస్తుందన్నారు. సబ్సిడీ వివరాలు కొరకు ఫోన్ నంబర్లను సంబంధిత బ్యాంక్, గ్యాస్ ఏజెన్సీలలో మార్చుకోవాలన్నారు. గ్యాస్ కనెక్షన్ పొందే క్రమంలో ఏవైనా సందేహాలు ఉంటే కలెక్టర్ కార్యాలయంలోని పౌరసర ఫరాల శాఖ అధికారిని సంప్రదించవచ్చునని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్‌వో వంశీకృష్ణారెడ్డి, ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి రాజీవ్ పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎంను కలిసిన టిటిడి సభ్యులు రాజు

ప్రజాశక్తి-మడకశిర

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో డిప్యూటీ సిఎం కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు డిప్యూటీ సిఎం కె.పవన్‌కళ్యాణ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రాజు ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శ్రీవెంకటేశ్వర స్వామి ప్రతిమను పవన్‌కళ్యాన్‌కు అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆరు కాసేపు తిరుమల దేవస్థానం విషయాలపై చర్చించారు. గతంలో తిరుమలలో జరిగిన అన్యాయాలు జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని పవన్ కళ్యాణ్ ఎంఎస్ రాజుకు సూచించినట్లు ఆయన తెలిపారు.

డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌ను సన్మానిస్తున్న టిటిడి సభ్యులు రాజు

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

ప్రజాశక్తి-పెనుకొండ

మండలంలోని మునిమడుగులో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహిస్తామని తహశీల్దార్ శ్రీధర్ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 12న దుద్దేబండ, 13న గొందిపల్లి, 14న ఎర్రమంచి, 15న గోనిపేట, 19న మావుటూరు, 20న గుట్టూరు, 21న నాగలూరు, 22న అడదాకులపల్లి, 26న పెనుకొండ, 27, 28, 29, డిసెంబర్ 3న రాంపురం, డిసెంబర్ 4, 5 తేదీల్లో శెట్టిపల్లి పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

లేపాక్షి: మండలంలో భూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 8 నుంచి 26వ తేదీ వరకూ పంచాయతీ కేంద్రాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తామని ఇన్‌ఛార్జి తహశీల్దార్ కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం కోడిపల్లి పంచాయతీలో గ్రామసభ ఉంటుందన్నారు.

గుడిబండ : ఈ నెల 8 నుంచి 28వ తేదీ వరకు మండల వ్యాప్తంగా రెవెన్యూ గ్రామాల్లోని సచివాలయంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ కరుణాకర్ తెలిపారు. 8వ తేదీ రాళ్లపల్లి, శంకరగల్లు, 12న ముత్తుకూరు, 13న కేకాతి, 14న మోరుబాగల్, 15న కరికెర, 19న కొంకల్లు, 20న ఎస్.రాయపురం, 21న చిగతుర్పి, 22న కెఎన్.పల్లి, 26న మందలపల్లి, 27న గుణేమోరుబాగల్, 28న గుడిబండలో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. గ్రామసభలకు విఆర్వోలు, అధికారులు తప్పక హాజరు కావాలని తెలిపారు.

హరియాన్‌చెరువులో లేఅవుట్ పరిశీలన

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

మండలంలోని న్యామద్దెల పంచాయతీ పరిధిలోని హరియాన్‌చెరువు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌లను గురువారం మండల రెవెన్యూ, పంచాయతీ అధికారులు పరిశీలించారు. హరియాన్‌చెరువు గ్రామంలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ వేసినట్లు తెలుస్తోంది. దీంతో తహశీల్దార్ ఎన్.సురేష్ కుమార్, ఎంపిడిఒ శివశంకరప్ప ఆదేశాల మేరకు గురువారం ఆర్ఐ నరసింహ మూర్తి, గ్రామ రెవెన్యూ అధికారి విశ్వనాథ్‌రెడ్డి, విఆర్ఎ పెద్దన్న, న్యామద్దెల గ్రామ పంచాయతీ కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, రమణ హరియాన్‌చెరువు గ్రామంలో పర్యటించి లేఅవుట్‌ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా బదలాయించకుండా, పంచాయతీ అనుమతి లేకుండా, నిబంధనల కు విరుద్ధంగా లేఅవుట్ వేశారని మండల స్థాయి అధికారులకు తెలిపారు. అయితే అనదికార లే అవుట్‌పై మండల, గ్రామ పంచాయితీ అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

హరియాన్‌చెరువులో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న రెవెన్యూ, పంచాయితీ అధికారులు

నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి సవిత, ఎంపి పార్థసారధి, జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-గోరంట్ల

రాష్ట్ర వ్యాప్తంగా వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, ఎంపి బికె.పార్థసారధి, జిల్లా కలెక్టర్ టిఎస్. చేతన్ తెలిపారు. మండలంలోని బి.గొల్లపల్లి గ్రామంలో రూ. 78.98 కోట్ల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 220/132 కె.వి. విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం సిఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సవిత, ఎంపి పార్థసారధి, జిల్లా కలెక్టర్ చేతన్ హాజరై విద్యుత్ ఉప కేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ. 6 వేల కోట్లతో చేపట్టిన విద్యుత్ ప్రాజెక్టులను సిఎం చంద్రబాబు ప్రారంభించారన్నారు. అందులో భాగంగా గోరంట్లలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామ న్నారు. ఈ సబ్ స్టేషన్ వల్ల గోరంట్ల, చిలమత్తూరు, పుట్టపర్తి మండలాలకు విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు పగటి పూట 9 గంటల నాణ్యమైన నిరంతర విద్యుత్ అందుతుందన్నారు. గృహ, ఇతర రంగాలకు మెరుగైన విద్యుత్ అందుతుందన్నారు. లో వోల్టేజీ సమస్యలు, విద్యుత్ సరఫరాలో నష్టాలు, అంతరాయాలు తగ్గుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పర్యావరణ హితమైన సౌర, పవన విద్యుత్ కేంద్రాల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నా యన్నారు. అందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లా పరిసర ప్రాంతాల్లో ఉత్పత్తి అయిన సౌర, పవన విద్యుత్‌ను ఎపి గ్రిడ్‌కు అను సంధానం చేసేందు కు ఈ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించామన్నారు. ఈ ప్రాంతం పరిధిలోని గృహ, వ్యవసాయ, పారిశ్రామిక అవసరాల మేరకు 33 కె.వి. ఫీచర్స్ మంజూరైందని, త్వరలో ఈ పనులు చేపట్టి వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఎంపి మాట్లాడుతూ సోలార్ ప్రాజెక్టుపై ఈ ప్రాంత రైతుల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. సోలార్ ప్రాజెక్టు వల్ల సోలార్ ఏజెన్సీ వారు ఒప్పందం ప్రకారం రైతుల నుంచి భూములను లీజుకు తీసు కొని ఏడాదికి ఎకరాకు రూ. 30 వేలు ఇస్తారన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ మారుతి, ఎంపిడిఒ నరేంద్ర కుమార్, విద్యుత్ శాఖ అధికారులు, టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు బాలకృష్ణచౌదరి, ఉత్తమ్‌రెడ్డి, చంద్ర, నరేష్, దేవా, నర్సింహప్ప, అశ్వత్థరెడ్డి, చంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, వేణు రాయల్, అజ్మతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత, ఎంపి పార్థసారథి, కలెక్టర్ చేతన్

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-రొద్దం

మండల కేంద్రమైన రొద్దంకు చెందిన టిడిపి పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు ఆ గ్రామం వెళ్లి మల్లికార్జున మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10వేలు అందజేశారు. అలాగే నల్లూరు గ్రామానికి చెందిన ఎంఆర్పీఎస్ నాయకుల నాగరాజు తండ్రి అంజనప్ప(86) మృతి చెందగా ఆ గ్రామం వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10వేలు అందజేశారు. ఆయన వెంట సీనియర్ నాయకులు మాధవనాయుడు, హరీష్, డీలర్ల సంఘం అధ్యక్షుడు సిద్దన్న, బేల్దారి క్రిష్టప్ప, ఉగ్గిరప్ప, రాజు ఉన్నారు. అలాగే ఎంపి బికె.పార్థసారధి కుమారుడు సాయికళ్యాణ్, టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు మల్లికార్జున మృతదేహంపై టిడిపి జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో నాయకులు జివిపి నాయుడు, మాజీ ఎంపిటిసి నారాయణప్ప, సూర్యనారాయణ, సత్యశేఖర్, హరీష్, వెంకటరత్నం ఉన్నారు. అలాగే కోగిర గ్రామంలో అంజనరెడ్డి అనారోగ్యంతో మృతిచెందగా ఆ గ్రామం వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న వెంకటేశ్వరరావు

మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సాయికళ్యాణ్, సుబ్బరత్నమ్మ

టిడిపి సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

పెనుకొండ : కార్యకర్తలకు టిడిపి ఎప్పుడూ అండగా ఉంటుందని నాయకులు తెలిపారు. సభ్యత్వ నమోదుపై గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వార్డు ఇన్‌ఛార్జులతో సమావేశం నిర్వహించారు. పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీరాములు మాట్లాడుతూ వార్డుల్లో సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలన్నారు. సభ్యత్వం ఉంటే వారి జీవితానికి ఒక భరోసా అన్నారు. సభ్యత్వ నమోదు ఉంటేనే భవిష్యత్తులో నామినేటెడ్ పోస్టులైనా, స్థానిక సంస్థలు, పార్టీ పదవులైనా దక్కుతాయన్నారు. సమావేశంలో వార్డు ఇన్‌ఛార్జులు బాబుల్‌రెడ్డి, నంజుండ, నరేంద్ర, రామలింగ, రఘువీరాచౌదరి, రామాంజనేయులు, నారాయణనాయక్, అస్లాం, దాదు, చెంద్రాయుడు, సుబ్రహ్మణ్యం, బాబునాయక్, సోము, మల్లికార్జున, ఈశ్వరయ్య, గోపి, అంజేనాయక్, రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

రొద్దం : మండలంలోని ఎల్‌జిబి నగర్‌లో టింబక్టు కలెక్టివ్ సంస్థ సిఇఒ లావణ్య, సుశీలమ్మ ఆధ్వర్యంలో గురువారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా మహాశక్తి ప్రోగ్రాం అసోసియేట్ పావని హాజరయ్యారు. మహాశక్తి గురించి క్రిష్టమ్మ, న్యాయ సలహా కేంద్రం కమిటీ గురించి లక్ష్మినరసమ్మ వివరించారు. అలాగే బాల్యవివాహాలు, గృహహింస, నిర్ణయాధికారాలపై సొసైటీ సిబ్బంది నాటిక రూపంలో మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు, సొసైటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై నాటిక రూపంలో అవగాహన కల్పిస్తున్న సభ్యులు

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల వైద్యాధికారి హరికుమార్ ఆధ్వర్యంలో గురువారం క్యాన్సర్‌పై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి అవగాహన ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పొగాకు ఉత్పత్తులు, ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. పిల్లలకు పాలు ఇవ్వడం వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ రాదన్నారు. స్వచ్ఛందంగా వాయు కాలుష్యాన్ని తగ్గించాలని, మంచి ఆహారం తీసుకోవడంతో పాటు శారీరక వ్యాయామాలు చేయాలని సూచించారు. ర్యాలీలో సిహెచ్ఒ మనోహర్‌రెడ్డి, పర్యవేక్షకులు రత్నమ్మ, రవీంద్ర, ఫార్మాసిస్ట్ ప్రభాకర్‌రాజు, ల్యాబ్ అసిస్టెంట్ అనిల్, ఎఎన్ఎంలు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై ర్యాలీ చేపట్టిన పిహెచ్‌సి సిబ్బంది

కిడ్నీ బాధితునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని గలిబిపల్లి గ్రామంలో చౌడప్ప కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న సమాజ సేవకులు, లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం రమానందన్ ఆ గ్రామం వెళ్లి చౌడప్పను పరామర్శించి రూ. 10వేలు అందజేశారు. రమానందన్‌కు చౌడప్ప కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట బోర్ల అంజనరెడ్డి, తదితరులు ఉన్నారు.

మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సాయికళ్యాణ్, సుబ్బరత్నమ్మ

తండ్రీకూతుళ్ల మృతికి ఎపిటిఎఫ్ నివాళి

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రమేష్(42) వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఆయన కూతురు భవితతో కలిసి గత బుధవారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పెనుకొండలోని గుట్టూరు వద్ద అనంతపురం-బెంగళూరు ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో భవిత మృతి చెందింది. కూతురు మృతితో తీవ్ర మనోవేదకు గురైన రమేష్ అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో ఇద్దరి మృతదేహాలను గురువారం రమేష్ స్వగ్రామమైన ధర్మవరం చేర్చారు. విషయం తెలిసిన వెంటనే మండలంలోని ఎపిటిఎఫ్ నాయకులు ధర్మవరం వెళ్లి తండ్రి, కూతుళ్ల మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్ కుమార్, జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్ మల్లికార్జున, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, బలరాం, బయన్న, ఈశ్వరయ్య, శ్యామ్‌సుందర్ (మడకశిర), శ్రీనివాసులు, రామాంజనేయులు, వెంకటేశులు, రొద్దం మండల అధ్యక్షులు ఆంజనేయులు, యల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

పిఇటి రమేష్ మృతదేహానికి పూలమాల వేస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి www.prajasakti.com

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పరిగి

పరిగి మండల యుటిఎఫ్ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం జరిగిన యుటిఎఫ్ మండల సర్వసభ్య సమావేశంలో మండల శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మహంతి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు జికొండ్ బాబు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులుగా సత్యవతి,ప్రధాన కార్యదర్శిగా జి .సుల్తాన్, ట్రెజరర్‌గా బి నరసింహమూర్తి, గౌరవాధ్యక్షులుగా బాబా ఫక్రుద్దీన్, ఉపాధ్యక్షులుగా కడికం శ్రీదేవి, ఎం. రాజు సిపిఎస్ కమిటీ కన్వీనర్‌గా ఎం. శేఖర్, జిల్లా కార్యదర్శులుగా మహంతేశ్వర, శంకరప్ప, మహమ్మద్ షఫీ, సునన్న, పి రామకృష్ణ ,జాజావలి ,ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎం.చలపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఓటరు నమోదుపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఈ నెల 9,10,23,24 వ తేదీలలో ఓటరు నమోదు పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ యూనస్ బాబు తెలిపారు. 18 ఏళ్ల నిండిన వారితో పాటు ఓటరు కార్డులో తప్పులను సరిచేసుకునే వారు మండల పరిధిలోని 52 వ పోలింగ్ కేంద్రం వద్ద సంబంధిత ఫారాలు బీఎల్‌ఓలకు ఇవ్వాలని అన్నారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలో శుక్రవారం నుంచి డిసెంబర్ 5 వరకు రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ యూనస్ బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన గ్రామసభలకు సంబంధించిన షెడ్యూల్‌ను గురువారం విడుదల చేశారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి తల్లి తమ బిడ్డ ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న, గైనకాలజిస్ట్ డాక్టర్ బాబాబుడెన్, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అష్ఫాక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసుపత్రిలో శ్రీ సత్య సాయి సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శిశు ఆరోగ్య సంరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన తర్వాత గంటలోపు తల్లిలో ఉత్పత్తి అయ్యే ముర్రుపాలలో వ్యాధి నిరోధకశక్తి అధికంగా ఉంటుందన్నారు. తప్పనిసరిగా బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి పాలు ఇవ్వాలన్నారు. అదే విధంగా బిడ్డకు ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. పోత పాలు, రసాయనిక ఆహార పదార్థాలను ఇవ్వడం వల్ల పిల్లల ఆరోగ్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. ప్రతి గర్భిణి అందుబాటులో ఉన్న పత్తి సిద్ధంగా ఉంచి పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం పోషకాహారానికి సంబంధించిన లోగోను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ ఓబుళమ్మ, సుశీల, న్యాయవాదులు కలావతి, నవీనా, సంతోష కుమారి, పార్వతి, భాగ్య, హబ్బా, లోక్ అదాలత్ శారద తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూమకుంట సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా రూరల్ మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఎడి గురువారం తెలిపారు. రూరల్ మండలంలోని గోళాపురం, తూమకుంట, చౌళూరు, సంతేబిదనూరు, బేవినహళ్లి, ఈడురులపల్లి, నక్కలపల్లి, సంజీవ్ రాయునపల్లి, కిరికెర, బసవనపల్లి, దేవరపల్లి, కొటిపి, కగ్గల్లు, సుబ్బిరెడ్డి పల్లి, అప్పలకుంట గ్రామాలలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది అన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని గువ్వలగుట్టపల్లి పాఠశాల విద్యార్థులకు పెన్నులు పుస్తకాలు పంపిణీ చేశారు. గురువారం విద్యుత్ ఏ ఇల్ఫ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు షామీర్ ఆధ్వర్యంలో పుట్టపర్తి పట్టణానికి చెందిన శిరీష జన్మదిన సందర్భంగా వీటిని పంపిణీ చేశారు. గువ్వల గుట్టపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలకలు, రైటింగ్ ప్యాడ్స్, నోట్ బుక్స్, పెన్నిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జావీద్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి - ఓబులదేవర చెరువు

మండల పరిధిలోని ఎర్రబల్లి గ్రామంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా బ్యాంకు బ్రాంచి మేనేజర్ రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రగతి బ్యాంకు ద్వారా వినియోగదారులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత గోరంట్ల కౌన్సిలర్ లక్ష్మన్న, వ్యాపార ప్రతినిధి నాగరాజు, అశోక్ నరసింహులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లకు సహకరించండి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మున్సిపల్ ఆదాయానికి సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని కమిషనర్ ప్రమోద్ కుమార్ సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయం, సచివాలయ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయ ఆదాయానికి సచివాలయ ఉద్యోగుల కృషి ఎంతో అవసరమని అన్నారు. మున్సిపాలిటీలో ఆస్తి పన్ను రూ.13.77 కోట్లు, నీటి పన్ను 8.88 కోట్ల రూపాయలు, ఖాళీ స్థలాల పన్ను 90 లక్షల రూపాయల మేర బకాయిలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రమోద్ కుమార్, పట్టణ పరిధిలోని సచివాలయాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం చెరువుకు పర్యాటక శోభ

నేడు బోటింగ్ ప్రారంభం

ప్రజాశక్తి బుక్కపట్నం

రాయలసీమలోనే అతిపెద్ద చెరువైన బుక్కపట్నం చెరువు పర్యాటకశోభ సంతరించుకుంటోంది.కొన్ని సంవత్సరాలుగా మండల ప్రజలు ఎదురు చేస్తున్న బోటింగ్‌ను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మంత్రి చేతుల మీదుగా గురువారం ప్రారంభిస్తున్నట్లు టూరిజం శాఖ అధికారి ప్రతాప్ రెడ్డి, నిర్వాహకులు జ్యోతి కేశవ తెలిపారు. బోటింగ్ ప్రారంభం కావడంతో ప్రజలకు ఆహ్లాదంతో పాటు, బోటింగ్ కల నెరవేరనుంది. స్పీడ్ బోటింగ్, సైకిల్ బోటింగ్ వంటి వాటిని అందుబాటులో తేవడంతో ఉత్సాహంగా పర్యాటకులు పాల్గొనే అవకాశం ఉంది. టిడిపి ప్రభుత్వంలో బుక్కపట్నం చెరువును పర్యాటకంగా అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జలహారతి కార్యక్రమంలో పేర్కొన్న నేపథ్యంలో ఆ కల ఇప్పుడు నెరవేరనుంది. బుక్కపట్నం తో పాటు, పుట్టపర్తి కొత్తచెరువు గ్రామ ప్రజలకు బోటింగ్ అవకాశం కలగనుంది.

బుక్కపట్నం చెరువులో ఉన్న బోట్లు

రాష్ట్ర స్థాయి పోటీలకు విజయ్ తరుణ్ ఎంపిక

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రాష్ట్ర స్థాయిలో ఈ నెల 9 నుండి 11 తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే 68 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే జట్టులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. అండర్ 19 విభాగంలో పాల్గొనే జట్టులో బాలుర విభాగంలో విజయ్ తరుణ్ ఎంపికయ్యారని ధర్మాంభ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజషన్ సెక్రటరీ శెట్టిపి జయ చంద్రా రెడ్డి తెలిపారు. అక్టోబర్ 21వ తేదీన తేదీన అనంతపురం నగరంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన సెలక్షన్స్‌లో వీరు ప్రతిభ చూపి ఎంపికయ్యారని చెప్పారు. వీరి ఎంపిక పట్ల అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామి రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ తుల్లా, కోచ్ సంజయ్ హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిభా విద్యార్థితో నాయకులు

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి

విలేకరుల సమావేశంలో పాల్గొన్న డీఎస్పీ, సిఐలు

ప్రజాశక్తి-హిందూపురం

శాంతి భద్రతల పరిరక్షణ కోసం పట్టణంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని అందుకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని హిందూపురం డిఎస్పి మహేష్ కోరారు. గురువారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరాలను నియంత్రించాలన్న లక్ష్యంతో హిందూపురం సర్కిల్ పరిధిలో రాత్రి 10 గంటల తర్వాత సరైన కారణం లేకుండా ఎవరు రోడ్లపై ఉండరాదన్నారు. ఈ నెల 11 నుంచి ఈ నిబంధనను అమలు చేస్తున్నామన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, దుకాణాలు మొదలైన కమర్షియల్ షాపులు ప్రతిరోజు రాత్రి 10 గంటలకల్లా బంద్ చేయాలన్నారు. అత్యవసర సేవలకు సంబంధించిన హాస్పిటళ్లు, మందుల షాపులు వంటి వాటికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న బార్ అండ్ రెస్టారెంట్లు మాత్రమే రాత్రి 11 గంటల దాకా నిర్వహించుకోవచ్చన్నారు. ముఖ్యంగా హస్నాబాద్, ముక్కడిపేట, రహమత్‌పురం వంటి ప్రాంతాల్లో రాత్రి 12 గంటల దాకా షాపుల్లో సిగరెట్లు, గుట్కా అమ్ముతున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. అలాంటి షాపుల నిర్వాహకులు ఈ నెల 11 నుంచి అలాగే చేస్తే తప్పకుండా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డివిజన్ వ్యాప్తంగా నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు, సైలెన్సర్స్ తీసేసిన వాహనాలను సీజ్ చేస్తామన్నారు. పట్టణంలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు తీసుకున్న ఈ నిర్ణయానికి ప్రజలు, వ్యాపారులు సహకరించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వన్‌టౌన్, టూటౌన్, అప్ గ్రేడ్ స్టేషన్ల సిఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మినీ గోకులాలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం మినీ గోకులాలు మంజూరు చేసిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ పోలప్ప సూచించారు. కదిరి రూరల్ మండలం కదిరి కుంట్ల పల్లి గ్రామపంచాయతీలోని ఎస్ సుదర్శన్ రెడ్డి పొలంలో ఏర్పాటు చేస్తున్న గోకులం షెడ్డు పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో అరుణ్ రషీద్, ఈసీ శ్రీధర్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ మంజునాథ, ఎఫ్ఎ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

మినీగోకులం షెడ్డు నిర్మాణానికి కొలతలు వేస్తున్న అధికారులు

గోడల వద్దే నిలిచిన భవన నిర్మాణ పనులు

ఆగిన పంచాయతీ దుకాణ సముదాయం

ప్రజాశక్తి - తనకల్లు

మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం నిర్మించతలపెట్టిన దుకాణ సముదాయం గోడలకే పరిమితమైంది. గతంలో చామంతి వెంకటరమణ సర్పంచిగా ఉన్న సమయంలో పంచాయతీ కార్యాలయ వద్ద రెండు గదులతో దుకాణ సముదాయాన్ని ఏర్పాటు చేశారు. వాటిని అద్దెకి ఇవ్వగా ప్రతి నెల పంచాయతీకి 5వేల రూపాయల అద్దె వస్తోంది. ప్రస్తుతం నిర్మాణం ఆగిపోయిన రెండు గదులను పూర్తి చేస్తే పంచాయితీకి ఆదాయం సమకూరుతుందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం

అవగాహన ర్యాలీలో విద్యార్థులు, వైద్యసిబ్బంది, అధికారులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలనిజిల్లా ఎన్‌సిడి, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ నివేదిత సూచించారు. పుట్టపర్తి మండల పరిధిలోని యనుములపల్లి లోని వాసవి ప్రాథమిక పాఠశాల, జగరాజు పల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా నివారణ సులభతరం అవుతుందని తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న మాట్లాడుతూ మంచి అలవాట్లు, ఆరోగ్య కరమైన ఆహారంతో క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కొనవచ్చునని, క్రమం తప్పని వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ధూమపానం, మత్తు పానీయాలకు దూరంగా ఉండి మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఎపిడెమియోలోజిస్ట్ బాలాజీ నాయక్ మాట్లాడుతూ జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ ఇంటి వద్దనే వైద్య ఆరోగ్య సిబ్బంది వచ్చి పరీక్షలు చేస్తారని ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, లలితకుమారి, జగరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈశ్వరనారాయణ రెడ్డి, వాసవి స్కూల్ సునందా దేవి , సిబ్బంది, విద్యార్థులు, సూపర్ వైజర్ చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పి అపర్ణ, ఆరోగ్య కార్యకర్తలు సుహాసిని, అంజుల, ప్రమీల, అంగనవాడి టీచర్ విజయలక్ష్మి, ఆశా కార్యకర్త జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

చదువుతో సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఒడిసి సెక్టర్ ఏరియా కోఆర్డినేటర్ రవీంద్ర పేర్కొన్నారు.మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో వయోజన విద్య శాఖ ద్వారా జరిగే నిరంతరం విద్యా కార్యక్రమం ఉల్లాస్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీడీవో రాబర్ట్ విల్సన్ ఆధ్వర్యంలో ఐకెపి యానిమేటర్లు మహిళా సంఘాల సభ్యులు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ చదువు తోనే సమాజంలో ప్రత్యేక గుర్తింపు వస్తుందని అందుకోసం ప్రతి ఒక్కరు చదువుకోవాలని తెలిపారు. ముఖ్యంగా మహిళా సంఘాల సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వెలుగు యానిమేటర్లు నిత్యం గ్రామీణ ప్రాంత ప్రజలతో కలుస్తూ ఉంటారని వారు చదువు యొక్క ప్రాధాన్యతను గ్రామీణ ప్రాంత ప్రజలకు వివరించి ప్రతి ఒక్కరు చదువుకొని అక్షర జ్ఞానం కలిగే విధంగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు సురేష్, రమణ, సీసీలు వేణుగోపాల్, రమణ, చంద్రారెడ్డి, సోమశేఖర్ రెడ్డి, చెన్నకేశవులు, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ్ కుమారి, షమీం, మండల సమైక్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై అవినీతి ఆరోపణలు

ప్రజాశక్తి - తలుపుల

తలుపుల మేజర్ పంచాయతీకి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై అధికారులు విచారణ నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల విధుల్లోకి చేరిన ఆయన పేరు ఇంతవరకు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. తనకు అధికారపార్టీ నాయకుల అండ ఉందని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. పనికి వెళ్లని వారి పేర్లు మస్టర్లలో రాసి బిల్లులు చేసుకుని స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆయన చేస్తున్న నిర్వాకానికి అటు అధికారులు, ఇటు ప్రజలు, పలువురు నాయకులు విసుగెత్తిపోతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్ పై చర్యలు ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో రమా నాయక్, ఇన్‌ఛార్జి ఎపిఒ వీరారెడ్డిని వివరణ కోరగా ఇప్పటివరకు అధికారికంగా ఫీల్డ్ అసిస్టెంట్లను ఎవరిని నియమించలేదన్నారు. సీనియర్ మేట్ కింద కొందరిని తీసుకున్నామని చెప్పారు. వారిపై వచ్చిన అవినీతి ఆరోపణలు రుజువైతే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - కదిరి టౌన్

యుటిఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆసంఘం నాయకులు గురువారం విడుదల చేశారు. ఈనెల 10 న ఆదివారం కదిరి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించే స్వర్ణోత్సవ మహా సభల పోస్టర్లను నల్లమాడ ఎంఇఒ వేమ నారాయణ, రెడ్డిపల్లి ప్రధానోపాధ్యాయులు జంషీద్, యుటిఎఫ్ నల్లమాడ మండల అధ్యక్షుడు అయుబ్ భాష, ప్రధాన కార్యదర్శి సుధాకర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమశేఖర్, చంద్రనాయక్, సుధాకర్, పోతులయ్య, ఫైరోజ్‌బాష, బాబు నాయక్, లక్ష్మీనారాయణ, శివలక్ష్మి దేవి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని ఆసంఘం జిల్లా ఆడిట్ కన్వీనర్ ఆర్. రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని బిఎస్సార్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ జిల్లా మున్సిపల్ కన్వీనర్ బిల్లే రామాంజనేయులు, స్థానిక నాయకులు రాంప్రసాద్, హరిశంకర్, ప్రదీప్ కుమార్ తదితరులతో కలిసి యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి

ప్రజాశక్తి - బుక్కపట్నం

వైసిపి నాయకుల బెదిరింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ మారాల గ్రామానికి చెందిన యువకుడు గౌతమ్(28) బుధవారం రాత్రి మృతిచెందాడు. నాలుగు రోజుల క్రితం వైసిపి నాయకులు బెదిరించడంతో మనస్థాపానికి గురై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు.

మృతుని కుటుంబానికి పరామర్శ : ఆత్మహత్యకు పాల్పడిన గౌతమ్ కుటుంబాన్ని టీడీపీ యువ నాయకుడు పల్లె వెంకట క్రిష్ణకిషోర్ గురువారం పరామర్శించారు. మృతుని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఎ వేధింపులకు గురిచేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.అనంతరం గౌతమ్ అంత్యక్రియల్లో పల్లె వెంకటక్రిష్ణ కిషోర్ రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా మృతుని కుటుంబసభ్యులకు రూ.25వేలను అందజేశారు. అదేవిధంగాఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మల్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గంగాధర్, అప్పస్వామి నాయుడు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

నిందితులు అరెస్టు

పుట్టపర్తి క్రైమ్ : బుక్కపట్నం మండలం మారాల గ్రామంలో వైసీపీ నాయకుల వేధింపులు తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనకు సంబంధించి నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు. నిందితులపై 306 ఐపిసి సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. మారాల గ్రామానికి చెందిన నారాయణస్వామి కుమా రుడు గౌతమ్‌ను వైసీపీ నాయకులు రామమోహన్, ప్రసాద్, గోపీ, సన్న రాములు వేధించారని, దీనికి సంబంధించి ఇటీవల బుక్కపట్నం పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారని చెప్పారు. 'మాపైనే కేసు పెడతావా.. మిమ్మల్ని చంపుతాం' అని మరోసారి వైసీపీ నాయకులు బెదిరించడంతో భయాందోళనకు గురైన గౌతమ్ ఈనెల 2వ తేదీన ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నట్లు తెలిపారు. తీవ్ర గాయాలతో ఈనెల 6వ తేదీన గౌతమ్ బెంగళూరులో మృతి చెందాడని చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి ప్రసాద్, గోపి, సన్న రాములును పరారీలో ఉన్న రామమోహన్ కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూలై నెలలోనే వైసీపీ నాయకులు వేధిస్తున్నారని బుక్కపట్నం పోలీసు స్టేషన్ లో టిడిపి కార్యకర్తలు ఫిర్యాదు చేస్తే ఒక ఎఎస్ఐ ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేయలేదని ఈ విషయం కూడా తమ దృష్టికి వచ్చిందని డీఎస్పీ పేర్కొన్నారు. దీనికి సంబంధించి విచారణ అధికారి ఇచ్చే నివేదిక ఆధారంగా ఎస్పీ ఆదేశాల మేరకు ఆ ఎఎస్‌పిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి పట్టణ సిఐ సునీత, బుక్కపట్నం ఎస్ఐ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కర్నాటక మద్యం విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలో అక్రమంగా కర్నాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. `కర్నాటక మద్యం విక్రయాలు నిర్వహిస్తున్న పరిగి మండలం కొడిగెనహళ్లికి చెందిన అశ్వర్థ నారాయణ, నరసాపురానికి చెందిన సిన్న అలియాస్ శీనా, శీగుపల్లికి చెందిన నాగరాజు, ఎర్రగుంటకు చెందిన నాగరాజు, సీతారాంపురానికి చెందిన గోవిందప్ప, రొద్దం మండలం శేషాపురానికి చెందిన సర్ఫుద్దీన్‌ను అరెస్టు చేయడం జరిగిందన్నారు. అలాగే హిందూపురం పట్టణంలోని మోడల్ కాలనీకి చెందిన విజయ్‌కృష్ణ, రియాజ్ ఖాన్‌లను అరెస్టు చేశామన్నారు. వారి నుండి కర్నాటక రాష్ట్రానికి చెందిన 716 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, మూడు ద్విచక్ర వాహనాలు సీజ్ చేయడం జరిగిందన్నారు.వీరిని హిందూపూర్ మండల తహశీల్దార్ వద్ద ఒక్కొక్కరికి ఒక లక్ష రూపాయల పూచికత్తు మీద ఒక సంవత్సర కాలానికి బైండోవర్ చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పృథ్వీరాజ్, ఫరూక్, హెడ్ కానిస్టేబుళ్లనరసింహ, రమణ, సతీష్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్ల ఆంజనేయులు, సురేష్, సుధాకరెడ్డి, శివ కుమార్, రవీంద్ర, కుమార్, రంగధామ, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఎ మృతి

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు విఆర్ఎ చిన్న రామన్న (62) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ నీలకంఠారెడ్డి చిన్నరామన్న మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రూ. 25 వేలను మృతుని భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ బాలాంజనేయులు, ఆర్ఐ కిరణ్, వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా పాటించాలని రూరల్ సిఐ శ్యామ రావు, ఆటో డ్రైవర్లకు, ప్రయివేటు వాహనదారులకు సూచించారు. ఈ మేరకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో సిఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలని, ఆటోలు, బోలోరాలు పరిమితికి మించి అధికంగా ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించరాదని చెప్పారు.

అసభ్యకరమైన పోస్టులు పెడితే చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారంచేసినా, అసభ్యకరమైన పోస్టులు పెట్టినా అలాంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వి.రత్న హెచ్చరించారు. ఈ మేరకు ఆమె గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. వివిధ వర్గాల మధ్య విద్వేషాలు రగిల్చే విధంగా, వ్యక్తిగత పేరుపైనా, ఫోటోలు మార్ఫింగ్ లాంటివి సోషల్ మీడియాలో పోస్టులు పెడితే చర్యలు తప్పవన్నారు.

ఓబుళదేవర చెరువు : సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మధుసూదన్ రెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా, ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్, ట్విట్టర్, యూట్యూబ్, వాట్సాప్ లాంటి గ్రూపుల్లోఎవరైనా ప్రభుత్వం పై కానీ, ప్రభుత్వం లోని వ్యక్తులపై గాని, మహిళలపై గాని అసభ్యకరమైన పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ముదిగుబ్బ : మండల ప్రజలు ప్రశాంత జీవనం కొనసాగించాలని ఎస్ఐ రాజశేఖర్ కోరారు. మండలంలోని నాగారెడ్డిపల్లి గ్రామంలో తన సిబ్బందితో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. గ్రామాలలోని ప్రజలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ప్రశాంత జీవనం కొనసాగించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతుళ్ల మృతి బాధాకరం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్‌తో పాటు ఆయన కూతురు భవిత మృతి చెందడం బాధాకరమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయ చంద్రా రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్ అన్నారు. ఈ మేరకు వారు బుధవారం తండ్రి, కూతుళ్ల మృతదేహాలను సందర్శించి నివాళులు అర్పించారు. అలాగే జనసేన రాష్ట్ర నాయకులు చిలకం మధుసూదన్ రెడ్డి మృత దేహాలను సందర్శించి నివాళులు అర్పించారు. అదే విధంగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ కార్యాలయ సిబ్బంది మృతుల కుటుంబాలను పరామర్శించారు.

హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం బార్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం అమరావతిలో హైకోర్టు న్యాయమూర్తులను కలిసి సమస్యలపై విన్నవించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్ ఆధ్వర్యంలో న్యాయవాదులు రామచంద్రారెడ్డి, సిద్దు, సుదర్శన్, నాగరాజు రెడ్డి తదితరులు ఉమ్మడి అనంతపురం జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ కే.శ్రీనివాస్ రెడ్డి, జస్టిస్ మహేశ్వర్ రావు, హైకోర్టు రిజిస్ట్రార్లు కమలాకర్ రెడ్డి, శ్రీనివాస్ శర్మను కలిశారు. హిందూపురం న్యాయ సముదాయంలో ప్రస్తుతం జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ప్రత్యేక మెజిస్ట్రేట్ న్యాయస్థాన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని వారి దృష్టికి తీసుకువచ్చారు. ఇటీవలే రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రత్యామ్నాయ భవనాలను సమకూర్చాలని ఆదేశించడంతో జిల్లా న్యాయమూర్తి జి.శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అందుబాటులో ఉన్న పలు భవన సముదాయాలను పరిశీలించారని చెప్పారు. ఇందుకు హైకోర్టు న్యాయమూర్తులు స్పందిస్తూ త్వరలోనే తాత్కాలికంగా భవన సముదాయాలను న్యాయస్థానాల నిర్వహణ కోసం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే పరిశీలించిన భవన సముదాయాల్లో న్యాయస్థానాల నిర్వహణకు అనువుగా ఉన్న భవన సముదాయాన్ని సమకూర్చేందుకు పరిశీలిస్తున్నట్లు చెప్పారని బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్ వివరించారు.